లివర్ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం చేస్తున్న సాయివికాస్‌రెడ్డి

చిట్వేలి: మండల పరిధిలోని తిమ్మయ్యగారిపల్లి పంచాయతీకి చెందిన మోడపోతుల నరసింహులు కొద్దిరోజులుగా లివర్ వ్యాధితో ఇబ్బంది పడుతుండటంతో ముక్కా ఫౌండేషన్ అధినేత ముక్కా రూపానందరెడ్డి కుమారుడు సాయి వికాస్‌రెడ్డి వైద్య నిమిత్తం సోమవారం రూ.30 వేలు ఆర్థిక సాయం చేశారు. అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని బాధితునికి సాయివికాస్‌రెడ్డి సూచించారు. కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. మండలంలో వివిధ రకాల ఇబ్బందుల్లో ఉన్న పలువురికి నా వంతు ఆర్థిక సహాయం అంటూ ఆపదలో ఉన్న వారికి ఆపద్బాంధవుడులా ఆయన సహాయం మరువలేనిది పేర్కొన్నారు. కార్యక్రమంలో బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, సాలవ రమణ రాజు, ప్రతాప్, పరశురామ్, తిమ్మయ్యగారిపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

కదం తొక్కిన అంగన్వాడీలు

అక్రమ అరెస్టులపై హోరెత్తిన నిరసనలు
రాస్తారోకోను అడ్డుకున్న పోలీసులు
ఆందోళనకు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు తలపెట్టిన మహాధర్నాను ప్రభుత్వం పోలీసుల ద్వారా ఉక్కుపాదం మోపి అణిచివేయాలని ప్రయత్నించింది. అందుకు నిరసనగా సోమవారం మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వ చర్యలకు ఆగ్రహించిన అంగన్వాడీలు కదంతొక్కారు. నిరసనకు సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ముందుగా సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణానికి చేరుకున్న అంగన్వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, సహాయకులు సమస్యలు పరిష్కరించమంటే అరెస్టు చేయడం సిగ్గు సిగ్గు, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, నాణ్యమైన ఆహార పదార్థాలను సరఫరా చేయాలని, హెల్పర్లకు, మినీ వర్కర్లకు ప్రమోషన్ ఇవ్వాలని పెద్దఎత్తున నినాదాలు చేసుకుంటూ మదనపల్లి, చిత్తూరు జాతీయరహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీనివల్ల ట్రాఫిక్ స్తంభించింది. మదనపల్లి డిఎస్‌పి కేశప్ప, ఒకటవ పట్టణ సిఐ మహబూబ్ బాషా, ట్రాఫిక్ సిఐ సుధాకర్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన విరమించాలని కోరారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకున్నారు. సహనం కోల్పోయిన పోలీసులు సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులును బలవంతంగా లాక్కుని పోలీస్ వాహనం ఎక్కించారు. కోపోద్రిక్తులైన అంగన్వాడీలు పోలీస్ వాహనాన్ని అడ్డుకుని రాస్తారోకో ఉధృతం చేశారు. డిఎస్‌పి కేశప్ప ఆదేశాలతో శ్రీనివాసులును ఒదిలేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు, తరువాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, వైసిపి ప్రభుత్వం హామీలిచ్చి మాట తప్పిందని విమర్శించారు. ధర్నాకు అనుమతి కోరినా పోలీసులు నిరాకరించారని తెలిపారు. పైపెచ్చు విజయవాడ వెళ్తున్న అంగన్వాడీలను రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టు చేశారని, నిర్బంధించారని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులను పోలీసు స్టేషన్లలోకి తీసుకెళ్తారని తెలిపారు. విజయవాడలోని రైల్వేస్టేషన్ నుండి వస్తున్న వందలాది మందిని అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లు, కల్యాణ మండపాల్లో నిర్బంధం ఉంచడం అప్రజాస్వామికమన్నారు. అనేక మంది అంగన్వాడీ యూనియన్ నాయకులను గృహ నిర్బంధం చేశారని తెలిపారు. మహిళలను విచక్షణ కూడా చూడకుండా పోలీసులు అమానుషంగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహించారు. రోడ్డుపక్కనే ప్రజలను బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో సామాన్య ప్రజల్ని కూడా తీవ్రంగా ఇబ్బంది పెట్టారని పేర్కొన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలు, ఉద్యోగులు, కార్మికుల గొంతునొక్కడం పచ్చి నిరంకుశత్వం తప్ప మరొకటి కాదని వెల్లడించారు. ప్రభుత్వ నిర్బంధాన్ని అన్ని పార్టీలు, సంఘాలు, ప్రజా స్వామికవాదులు ఖండించాలని కోరారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో అంగన్వాడీల కోర్కెలను ఆమోదించి ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయకపోతే వైసిపి ప్రభుత్వం ఇంటికి పోవడం ఖాయమన్నారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు శ్రీరాణి, లక్ష్మీనరసమ్మ, చాంద్ బి, సుభద్ర మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు, మినీవర్కర్లు, హెల్పర్లకు కనీస వేతనాలు చెల్లించేందుకు బడ్జెట్ కేటాయించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వారికి గ్రాట్యూటీని అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని మినీ సెంటర్లను తక్షణమే మెయిన్ సెంటర్లుగా మార్చాలని, టీచర్లకు ఇచ్చేంత వేతనాలు ఇవ్వాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఎఫ్ఆర్ఎస్‌తోపాటు వివిధ రకాల యాప్‌లను రద్దుచేసి ఒకే యాప్ ద్వారా విధులు నిర్వహించేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి రిటైర్మెంటు వయసును 62 ఏళ్లకు పెంచాలని, ఆఖరి వేతనంలో 50 శాతం పెన్షన్ ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్రాస్‌ను ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ల అద్దెలు, 2017 నుండి ఇప్పటి వరకూ టిఎ, డిఎ బిల్లులు, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. నాణ్యమైన సరుకులు లబ్ధిదారులకు సరిపోయేలా కచ్చితమైన కొలతతో ప్రతినెలా 5వ తేదీలోగా సకాలంలో అంగన్‌వాడీ సెంటర్లకు చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతే అరెస్టు చేయడం దుర్మార్గం అన్నారు.సమస్యలు పరిష్క రించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున అంగన్వాడీలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** ప్రభుత్వం అంగన్వాడీలపై నిరంకుశ వైఖరిని విడనాడాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ అన్నారు. హక్కుల సాధన కోసం అంగన్వాడీ కార్యకర్తలు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని అడ్డుకు న్నందుకు నిరసనగా సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎం.ఈశ్వరమ్మ, ఎం.విజయమ్మ, శివరంజని, అమరావతి, ఇందిరమ్మ, సునీత, వనిత, ఇంద్రావతి, మమత, అనురాధ, శ్రీలత పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** ప్రభుత్వ చర్యలకు నిరసనగా ఐసిడిఎస్ కార్యాలయం నుండి టోల్‌గేట్ మీదగా అంబేద్కర్ సర్కిల్, వరకు భారీ ర్యాలీ నిర్వహించారు, పోలీస్ స్టేషన్ వద్ద రాస్తారోకో చేసి బైఠాయించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్‌ని పోలీసులు అరెస్టు చేసి అనంతరం సొంత పూసికతుపై విడుదల చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు కోశాధికారి జి.పద్మావతి, వెన్నెల, దుర్గా, ఈశ్వరమ్మ, కుమారి, మాధవి, రోజా, మనేమ్మ, రెడ్డమ్మ, సునీత, నిర్మల, శ్రీదేవి, కోడూరు, ఓబులవారిపల్లి, పుల్లంపేట, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, మెనీ వర్కర్లు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి తంబళ్ళపల్లి నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సలీం బాషా, వేణు గోపాల్‌రెడ్డి, మండల నాయకులు జి.రఘునాథ్, గంగులప్పా, దుమ్ము బాబు, రియాజ్, హబీబ్, చంద్ర పాల్గొన్నారు. **రాయచోటిటౌన్:** అంగన్వాడీలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సిఐటియు, ఎఐటియుసి నాయకులు పేర్కొన్నారు. అంగన్వాడీల అరెస్టును నిరసిస్తూ పట్టణంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అంగ న్వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తలపెట్టిన విజయవాడ కార్యక్రమం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలను రెండు రోజుల ముందే ప్రభుత్వం పోలీసుల చేత జల్లెడ పట్టి ఎక్కడికక్కడ అరెస్ట్ చేసి భయభ్రాంతులకు గురి చేయడం అప్రజాస్వామిక చర్య అని ఎఐటియుసి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎ. రామాంజులు, సాంబశివ పేర్కొన్నారు. స్థానిక బంగ్లా వద్ద రెండు సంఘాల నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి తెలంగాణకన్నా అదనంగా జీతాలు పెంచుతామని, నేడు వేతనాలు పెంపులోగాని ప్రమోషన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యూటీ ఇవ్వలేదని పేర్కొన్నారు. ఐసిడిఎస్‌ను ప్రయివేటీకరణ చేసేందుకు యత్నాలు, దేశంలో ఎనలేని విధంగా నూతన విద్యా విధానం తీసుకురావడం వంటివి బాధాకరమన్నారు. చివరి అసెంబ్లీ సమావేశాలైన వెంటనే అంగన్వాడీలకు క్షమాపణ చెప్పి ధరలకనుగుణంగా కనీసవేతనం రూ. 26 వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం బంగ్లా వద్ద పెద్ద ఎత్తున మానవ హారంగా ఏర్పడి ప్రభుత్వానికి వ్యతిరేకంగ నినాదాలు చేస్తున్న చేశారు. దీంతో ట్రాఫిక్‌కు భారీ అంతరాయం ఏర్పడింది. సీఐ జోక్యం చేసుకుని ట్రాఫిక్ లేకుండా చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి. భాగ్యలక్ష్మి, ఖాజాబి, సిద్దమ్మ, నాగమణి, వంగిమళ్ళ రంగారెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుదీర్ కుమార్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సురేష్ కుమార్, ఎఐటియుసి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు సుహాసిని, ఇందిరమ్మ, రాధ, చిట్టెమ్మ, లక్ష్మిదేవమ్మ, ఉషా, సుజాత,రజని, శోభా,శారధ తులసి,భారతి, రత్నా, దుర్గా, రామతులసి పెద్ద ఎత్తున అంగన్వాడీలు పాల్గొన్నారు.

మదనపల్లె, రాజంపేట, రైల్వేకోడూరులో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు

ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి చేయాలి

- కలెక్టర్ గిరీష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష సంబంధత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష, వాహనమిత్ర, జగనన్నతోడు ఇకెవైసి, తదితర అంశాలపై కలెక్టర్ గిరీష పిఎస్, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వ హిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు .ఈనెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తారని, ఇందుకు సంబంధించి వాలంటీర్లు రెండో విడత ఇంటింటి సర్వే వంద శాతం తప్పక పూర్తి చేయాల న్నారు. సచివాలయ ఆరోగ్యకార్యకర్తలు, ఎమ్ఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు వాలంటీర్ల సహకారంతో ఇంటి ఇంటి సర్వే నిర్వహించి జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్‌లు తప్పనిసరిగా పంపిణీ చేయాలన్నారు. ఇంటింటి సర్వేలో సాధారణ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణీలు, బాలింతలు తగిన బరువు లేని పిల్లలను గుర్తించి వైద్య శిబిరానికి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆరోగ్య శిబిరంలో ఇద్దరు వైద్యాధికారులు, ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా అందించే వైద్య సేవలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. వైద్యం కోసం ప్రజలు ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వా సుపత్రులకు వెళ్లే విధంగా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి వైద్యులు, సిబ్బంది, అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇకెవైసి చేయించకపోతే తర్వాత లబ్ధిదారులు ఆ పథకాలకు అనర్హులవుతారన్నారు. లబ్ధిపొందిన వారందరి నుంచి ఇకెవైసి తప్పక చేయించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ సత్యనారాయణ, హౌసింగ్ పీడీ శివయ్య, డ్వామా పీడీ మద్దిలేటి, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

గ్యారంటీ లేని జిపిఎస్ వద్దే వద్దు : ఫ్యాప్టో

నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి- రాయచోటి

సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సి ఉండగా అందుకు భిన్నంగా జిపిఎస్ విధానాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ మంత్రి మండలి తీర్మానం చేయడాన్ని దారుణమని ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ రవిశంకర్ పేర్కొన్నారు. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం కలెక్టరేట్ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఒపిఎస్ ముగిసిన అధ్యాయమని ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవన్మరణ సమస్య అయిన పాత పెన్షన్ విధానం పట్ల మంత్రి నిర్లక్ష్యంగా మాట్లాడటం ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ఈ ప్రభుత్వానికున్న వైఖరిని తేటతెల్లం చేస్తుందన్నారు. మాట తప్పను, మడమ తిప్పను, విశ్వసనీయత కోల్పోతే పదవిలో కొనసాగను అని పదేపదే వల్లె వేసిన ముఖ్యమంత్రి ఈరోజు చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు భిన్నంగా ఉన్న జిపిఎస్ విధానాన్ని అంగీకరించే ప్రశ్నే లేదన్నారు. సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యమాలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం జిపిఎస్ విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి శివా రెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబిర్ మాట్లాడుతూ సిపిఎస్‌కు జిపిఎస్ ప్రతిరూపమే తప్ప వేరొకటి కాదన్నారు. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానానమే తమకు కావాలని, మరో పెన్షన్ విధానాన్ని అంగీకరించే ప్రశ్నే లేదన్నారు. సిపిఎస్ రద్దు పై హామీ ఇవ్వని అనేక రాష్ట్రాలు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తుంటే, ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒపిఎస్‌ను అమలు చేయక పోవడం దేనికి సంకేతమని వారు ప్రశ్నించారు. ఎపిటిఎఫ్ (1938) జిల్లా ప్రధాన కార్యదర్శి ఇలియాస్, ఎపిటిఎఫ్ (257) జిల్లా అధ్యక్షుడు హరి బాబు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని నిరసనలు తెలియజేసినా ఈ ప్రభుత్వం భరించడం లేదన్నారు. ఆందోళనలపై, ఉద్యమాలపై ఉక్కు పాదం మోపుతున్నదని ఆరోపించారు. సాధారణ ధర్నాలకు సైతం పోలీసులు ఇళ్లకు వచ్చి నోటీసులు ఇవ్వటం ఏంటని వారు ప్రశ్నించారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలియజేసే హక్కును కాలరాయడం తగదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ ప్రభుత్వానికి తగు బుద్ధి చెప్పే విధంగా కార్యాచరణ తీసుకుంటామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, రూటా జిల్లా అధ్యక్షులు సబాతుర్ రెహమాన్, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు రవీంద్ర రెడ్డి, యస్ ఎ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ ఖాన్, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా నాయకులు శివయ్య, జయన్న, దుర్గేశ్వర రాజు, మునవ్వర్, వెంకట రామిరెడ్డి, గోపి, నాగరాజు, వాసుదేవ రెడ్డి, శివ శంకర్, ఎపియుఎస్‌పియు రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించండి

ప్రజాశక్తి - రాయచోటి

జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ గిరీష, రెవెన్యూ డివిజనల్ అధికారి సత్యనారాయణ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీష మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలని పేర్కొన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్‌ఎల్‌ఎ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈనెలలో గాలివీడు, కె.వి పల్లి, పెనగలూరు, నిమ్మనపల్లి మండల కేంద్రాలలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి వచ్చిన అర్జీలను తదుపరి వారం లోగా తప్పనిసరిగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టరు ఆదేశించారు. అనంతరం అర్జీదారుల నుంచి వారు దరఖాస్తులను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పురస్కారం అందుకుంటున్న ఖాదర్‌బాషా

ఖాదర్‌బాషాకు గుర్రం జాషువ స్మారక జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి-పీలేరు

గుర్రం జాషువ స్మారక జీవిత సాఫల్య జాతీయ పురస్కారాన్ని పీలేరుకు చెందిన అంతర్జాతీయ బహుభాషా రంగస్థల, టివి, సినిమా కళాకారులు 'ఆల్ ది బెస్ట్' షేక్ ఖాదర్‌బాషా అందుకున్నారు. ఈ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం రాత్రి హైదరాబాదులోని తెలంగాణ సరస్వత భవనంలో అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎస్.సరోజనమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కావడి ఎల్లయ్య రచించిన జవరాలు, సాల్వేషన్ పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో గుర్రం జాషువా మనవడు సందేశ్, ప్రముఖ సినీ కమెడియన్ సుదర్శన్, సినీనటి ఫైజాజాన్, మరో సినీనటి పద్మ, బస్‌స్టాప్ సినిమా కోటేశ్వరరావు, రచయిత, దర్శకులు కరుణాకర్, విజయ చిత్ర పత్రిక సంపాదకులు విజయ్, జవరాలు సాల్వేషన్ పుస్తకాల రచయిత కావడి ఎల్లయ్య, అడ్వకేట్ అడ్వైజర్ శ్రీరామ్, సింగరేణి ఉద్యోగి డాక్టర్ కొండ సతీష్, యాంకర్, సింగర్ రజని పాల్గొన్నారు.

హామీల అమలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

- ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్

సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిభజన చట్టంలో అన్ని డిమాండ్లు అమలు, ప్రత్యేక హోదా, రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. స్థానిక బెంగుళూరు బస్టాండ్‌లోని ఇందిరమ్మ విగ్రహనికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి, రాహుల్ గాంధీ నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. అనంతరం ఇందిరానగర్ సర్కిల్ నుండి పాదయాత్రగా పార్టీ కార్యాలయానికి చేరుకొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జంగా గౌతమ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీనేనన్నారు. దేశంతో పాటు రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన చారిత్రాత్మక అవసరం చాలా ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడానికి పార్టీని సంస్థగతంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మండల, బూత్ కమిటీల నియామకం వేగంగా నిర్మాణం చేస్తున్నామని వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన తర్వాత ఎపిలోనూ కాంగ్రెస్ పార్టీ నూతన జవసత్వాలను సంతరించుకుంటున్నాయన్నారు. మదనపల్లె కాంగ్రెస్ పార్టీ బాద్యులు రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్షేత్రస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే లక్ష్యంతోపాటు సంస్థాగతంగా పటిష్టం చేయడానికి రాష్ట్ర పార్టీ ఆదేశాలతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు.అంతే కాకుండా పార్టీలోని కాంగ్రెస్ పార్టీ పట్ల ఆసక్తి ఉన్న వారందరినీ ఆహ్వానించడం జరుగుతుందన్నారు. మదనపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చే విధంగా అందరూ సమన్వయంతో ముందుకు సాగుతూ కష్టపడి సేవలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మదనపల్లి అసెంబ్లీ కన్వీనర్ లీలా శ్రీనివాస్, కడప జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు నజీర్ అహ్మద్, తంబళ్లపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఎం.ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్థసారథిరెడ్డి, రామచంద్ర, సోమశేఖర్‌రెడ్డి, ప్రభాకర్, సురేంద్రరెడ్డి, మీనా కుమారి, మహబూబ్ పీర్, మహమ్మద్ రఫీ,రామసముద్రం నుండి ఖాదర్ బాషా, డాక్టర్ ఎస్.కె.బాషా, బృందం, నిమ్మనపల్లి నుండి ముబారక్ ఖాన్ బృందం సభ్యులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ రద్దు చేయాలి : కెవిపిఎస్

రాయచోటి: వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రెండో విడత మెడికల్ (ఎంబిబిఎస్) కౌన్సెలింగ్ దళిత గిరిజనుల బడుగు బలహీన వర్గాల మైనార్టీ విద్యార్థులకు అన్యాయం చేసే విధంగా ఉందని, వెంటనే రద్దు చేయాలని కెవిపిఎస్ జిల్లా కో-కన్వీనర్ డి.సి.వెంకటయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే 107, 108 జిఒల ద్వారా మెడికల్ సీట్లలో రిజర్వేషన్ విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. ఇప్పుడు ఎంబిబిఎస్ కౌన్సెలింగ్‌లో ఓపెన్ కేటగిరీ సీట్లు భర్తీ చేయడం నిబంధనలకు విరుద్ధమని, దీనివల్ల బలహీనవర్గాలకు సీట్లు ఓపెన్ కేటగిరీలో సీట్లును కోల్పోతారని పేర్కొన్నారు.

పనిచేయని ఎస్‌బిఐ ఎటిఎం

గాలివీడు: స్థానిక బస్టాండ్ ఆవరణంలో ఉన్న ఎస్‌బిఐ ఎటిఎం మూడు రోజులుగా పనిచేయక మూతపడింది. ఖాతాదారులు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇతర బ్యాంకులకు చెందిన ముఖ్యంగా డిసిసిబి, ఎపిజిబి, కార్పొరేషన్ ఎటిఎంలలోనూ డబ్బులు అందుబాటులో లేవు. బస్టాండ్ ప్రాంతంలో అటు ప్రయాణికులకు, ఇటు ప్రజలకు ఏర్పాటు చేసిన ఎస్‌బిఐ ఎటిఎం మూడు రోజులుగా మూత పడడంతో పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బ్యాంకు శాఖ అధికారులు స్పందించి ఎస్‌బిఐ ఎటిఎంను ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

అవాంఛనీయ సంఘటనలకు దూరంగా ఉండాలి : సిఐ

గాలివీడు: గ్రామాలు, పట్టణాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టి చర్యలు తీసుకోవాలని లక్కిరెడ్డిపల్లె సిఐ వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం గాలివీడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు సందర్భంగా సిబ్బందికి ఆయన సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్ఐ వెంకటశివకుమార్, హెడ్ కానిస్టేబుల్, రైటర్ సిబ్బంది పాల్గొన్నారు.

శిథిల భవనంలో విధులెలా?

కూలే స్థితిలో ఆర్‌బికె భవనం పైకప్పు - ఆందోళనలో ఉద్యోగులు, రైతులు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

రైతు భరోసా కేంద్రం భవనం పైకప్పు కూలే స్థితిలో ఉంది. పట్టణంలోని పాత ఎంపిడిఒ కార్యాలయంలో ఆర్‌బికె భవనం ఏర్పాటు చేశారు. మండలంలోని దాదాపు మూడు వేల మంది రైతులు తమ అవసరాల నిమిత్తం ఇక్కడి ప్రతి రోజూ వచ్చి పోతుంటారు. రైతులకు అవసరమైన విత్తనం కాయలు, ఉలవలు, కందులు ఎరువులు ఆర్‌బికె సిబ్బంది అందజేస్తుంటారు. అలాంటి భవనంలోని పైకప్పులు ఊడిపోతుండడంతో వర్షపు నీరు రూములోకి చేరుతున్నాయి. రైతులకు ఇవ్వాల్సిన ఎరువులు మొత్తం తడిసిపోతున్నాయి. ఇటు ఆర్‌బికె సిబ్బంది, అటు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆర్‌బికెలను ఏర్పాటు చేసింది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి నూతన ఆర్‌బికె భవనం నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆర్‌బికె భవనంలో ఊడిపడుతున్న పైకప్పు

'వీర జవాన్లను స్మరించుకోవడం అందరి బాధ్యత'

ఎంఇఒకు మట్టి కలశం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పీలేరు

దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లను సర్మించుకుందామని ఎంఇఒలు వై.లోకేశ్వర్‌రెడ్డి, బి.పద్మావతి అన్నారు. సోమవారం మేరీ మిట్టీ మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అయ్యప్పరెడ్డి కాలనీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, జడ్పీ ఉన్నత ప్రధాన పాఠశాలల బోధనా సిబ్బంది, విద్యార్థులు కలశంలో మట్టిని సేకరించి దేశ నాయకుల చిత్రపటాలతో 'మేరీ మిట్టీ మేరా దేశ్' నినాదాలతో పురవీధుల్లో ఊరేగింపుగా మండల విద్యాశాఖ కార్యాలయం వరకు చేరుకున్నారు. వారు సేకరించిన మట్టిని మండల విద్యాశాఖ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వారిని గౌవించుకునేందుకు ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా గ్రామ, మండలం, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో నిర్వహింప బడుతోందన్నారు. దేశం నలుమూలల నుంచి సేకరించిన మట్టిని మన దేశ రాజధాని ఢిల్లీలో కొత్తగా నిర్మించిన పార్లమెంట్ ఆవరణలోని ఉద్యానవనంలో కలపడం జరుగుతుందని చెప్పారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ ముగింపు ఉత్సవాలు జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలల నుండి సేకరించిన మట్టిని ఒక కలశంలో పొందుపరిచి, విద్యార్థుల చేత పంచ్ ప్రాన్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజి నటరాజ, ఉపాధ్యాయులు జనార్ధన్, రమణ, రాజన్న, గౌస్, నాగవేణి, కిషోర్, ముని రామయ్య, అయ్యప్ప రెడ్డి కాలనీ జడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఫౌజియాబేగం, ఉపాధ్యాయులు జానం సుజాత, సంపూర్ణమ్మ, స్వప్నలత, విజయ కుమారి, గంగయ్య, ఉమామహేశ్వరి, జడ్పీ ప్రధాన ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సూర్య ప్రకాష్, మనోహర్, విద్యార్థులు, మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** గ్రామాల్లోని ప్రజలందరిలో జాతీయ స్ఫూర్తిని కలిగించడమే మేరా మాటి.. మేరా దేశ్.. లక్ష్యమని ఎంఇఒలు చక్రె నాయక్, వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. మండలంలోని స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ముందు నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశ నలుమూలల నుండి సేకరించిన మట్టి కలశాలను ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో స్వీకరిస్తారని తెలిపారు. ఈ మట్టితో అమరవీరుల స్మరక స్తూపాన్ని నిర్మించనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** "మేరీ మిట్టీ మేరా దేశ్" కార్యక్రమంలో భాగంగా నిమ్మనపల్లి మండలంలో ఎంపిడిఒ శేషగిరిరావు, స్థానిక సర్పంచులు ఆధ్వర్యంలో "మట్టి కా నమన్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అగ్రహారం పంచాయతీ సర్పంచ్ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి వెంకట రమణారెడ్డి, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం : డిపిఒ

ప్రజాశక్తి- కలకడ

పౌష్టికాహారం ఆవశ్యకత గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని డిపిఒ ధనలక్ష్మి తెలిపారు సోమవారం మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ కె.మాదిగపల్లె అంగన్వాడీ సెంటర్లో పౌష్టికాహార మాసోత్సవాలు సందర్భంగా పౌష్టికాహార ఆవశ్యకత గురించి గర్భిణులు, బాలింతలకు పౌష్టియకాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలు ముఖ్యంగా ఐరన్, క్యాల్షియం, పోలిక్ యాసిడ్ కలిగిన ఆహారం తీసుకోవాలని ప్రతి ఒక్కరూ ఆకుకూరలు, కూరగాయలు గుడ్లు, పాలు, మాంసవృత్తులు ఖర్జూరాలు, డ్రై ఫ్రూట్స్ తినాలని పేర్కొన్నారు. అంటినటల్ పరీక్షలు చేసుకోవాలని, బిడ్డ కదలికలను గమనించాలని, గర్భిణులు ఎడమవైపు తిరిగి పడుకోవాలని, మంచి భోజనాన్ని తీసుకోవాలని, వైయస్సార్ సంపూర్ణ పోషణ కింద మన ప్రభుత్వం ఇస్తున్న వస్తువులని సద్వినియోపరుచు కోవాలని, పిల్లలకి ఇచ్చే బాలామృతాన్ని పిల్లలకి సక్రమంగా పెట్టాలని ఎంపిపి శ్రీదేవి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, సిడిపిఒ రాజమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ శాంతాబాయి, అంగన్వాడీ వర్కర్స్ సుమతి నాగమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహార మాస ఉత్సవాలను పరిశీలిస్తున్న డిపిఒ ధనలక్ష్మి

పొదుగు వ్యాధుల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-రామాపురం

పశువుల్లో అధిక పాల ఉత్పత్తి పొందాలంటే పొదుగు వ్యాధులు లాంటివి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశు వైద్య అధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని నల్ల గుట్టపల్లి పంచాయతీ బి.రాచపల్లిలో సోమవారం విశిష్ట బడి కార్యక్రమంలో భాగంగా కార్యక్రమం పాడి పశువుల్లో పాల ఉత్పత్తి పెంచడం ఎలా అనే అంశంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువుల్లో పొదుగు వ్యాధి లక్షణాలు, పొదుగు వాపు రావడం, పాలు రంగు మారడం వంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే పశువుల ఆసుపత్రికి తీసుకెళి వైద్యులు ఇచ్చే సూచనలు, సలహాలను పాటించాలన్నారు. పశువుల పాకలు శుభ్రంగా ఉంచుకోవడం, పాలు పిండి ముందర పోగులు శుభ్రంగా కడగడం ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రాష్ట్రానికి పట్టిన శని జగన్ : ఆర్ఆర్

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రానికి పట్టిన శని జగన్ మోహన్‌రెడ్డి అని సైకోల నుంచి త్వరలోనే రాష్ట్రానికి విముక్తి లభించనుందని మాజీ ఎమ్మెల్యే టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్.రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహారదీక్షలు 14 వ రోజు చేరుకున్నాయి. వికలాంగులు రిలే నిరాహారదీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి నాయకులు తాత్కాలికంగా పైచేయి సాధించామని, సాధిస్తున్నామని సంబరపడొచ్చుని కానీ అంతిమ విజయం ఎప్పుడూ ధర్మానిదే అని చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి వల్ల రాష్ట్రం దారిద్ర్య దిగువ రేఖన ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరి తలపై రూ. 2 లక్షల 16 వేలు రూపాయలు అప్పు ఉందని పేర్కొన్నారు. మచ్చలేని నాయకుడు చంద్ర బాబు నాయుడుపై తప్పుడు కేసులు బనాయించడం జగన్ మోహన్ రెడ్డి దుచ్ఛర్యకు నిదర్శనం అన్నారు.చంద్రబాబు నాయుడు చేసిన తప్పేంటి నైపుణ్య శిక్షణ కేంద్రాలలో మన బిడ్డలకు ఉద్యోగాలు కల్పించడం నేరమా అని ప్రశ్నించారు. తన కుటుంబం కన్నా రాష్ట్ర ప్రజలే ముఖ్యమని రోజుకు 18 గంటలు నిరంతర శ్రామికుడుగా పని చేసిన ఏకైక నాయకుడు చంద్ర బాబు నాయుడని పేర్కొన్నారు.

గడువులోగా ఇన్‌స్పైర్ నామినేషన్లు సమర్పించండి

- డిఇఒ శ్రీరాంపురుషోత్తం

ప్రజాశక్తి - రాయచోటి

ఈనెల 30తో ఇన్‌స్పైర్ నామినేషన్ల గడువు ముగుస్తుందని ఆలోపు జిల్లాలోని ప్రతి పాఠశాలా నామినేషన్లు సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరాం పురుషోత్తం తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రయివేట్ పాఠశాలల కరస్పాండెంట్లకు ఇన్‌స్పైర్ మనాక్ నామినేషన్ల అవగాహన సదస్సును జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ఇన్‌స్పైర్ నామినేషన్ల సమర్పణలో అన్నమయ్య జిల్లాను అగ్రస్థానంలో ఉంచాలని అన్నారు. విద్యార్థులలో దాగివున్న శాస్త్రీయ భావాలను వెలికితీయడానికి ప్రతి పాఠశాలా ప్రయత్నించాలని అన్నారు. విద్యార్థుల వినూత్నమైన ఆలోచనలకు పదును పెట్టి ప్రోత్సహించాలని అన్నారు. నిర్లక్ష్యం తగదని ప్రతి పాఠశాల నుంచి నామినేషన్లు సమర్పించాలని ఆయన తెలిపారు. స్థానిక సమస్యలకు పరిష్కారంగా విద్యార్థుల ఆలోచనల నుంచి పుట్టుకొని వచ్చిన పరిష్కారాలతో వినూత్నమైనటువంటి ప్రాజెక్టులను రూపొందించి సమర్పించాలన్నారు నామినేషన్ల సమర్పణలో జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్ పాఠశాలలు చాలా వెనుకబడ్డాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఆవేదన వ్యక్తపరిచారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ గారి ఆదేశాలను ఆమలు పరచడంలో నిర్లక్ష్యం తగదన్నారు. పాఠాలు బోధించడమే చదువు కాదని అన్నారు. విద్యార్థులలో అంతర్లీనంగా ఉన్న విభిన్న వైఖరులను తప్పనిసరిగా ప్రోత్సహించాలని అన్నారు. నామినేషన్లు సమర్పించని ప్రతి ఒక్కరిపై శాఖా పరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటీషన్ నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేయాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాల నుండి మూడు, ఉన్నత పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు సమర్పించాలన్నారు. విద్యార్థులలోని శాస్త్రీయ వైఖరులను పెంపొందించడం కోసం ప్రాజెక్టులు రూపొందించి సమర్పించేటట్లు ప్రోత్సహించడం బరువుగా చూడక, బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు బాలాజీ, వెంకట శివారెడ్డి, కరిముల్లా, ఏ యస్ ఓ నాగేంద్రా రెడ్డి, సిఆర్‌పిల ప్రయివేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో నైపుణ్య సదస్సు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణ సమీపంలోని పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మెకోరేట బెంగళూరు వారిచే రెండు రోజుల నైపుణ్య సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు తెలిపారు. ఈ నైపుణ్య సదస్సులో మెకోరేట బెంగళూరు వారిచే డేటా యాక్సిస్ ఆఫ్ ఇండస్ట్రియల్ మల్టీ ఫంక్షన్ మీటర్ యూజింగ్ స్కాట్ విద్యార్థులకు శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పివరప్రసాదరావు, డైరెక్టర్ ఆఫ్ మెకోరేట బెంగళూరు వారు విద్యార్థులకు హార్డ్వేర్ టెక్నాలజీపై దానివల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. విద్యార్థులు హార్డ్వేర్ టెక్నాలజీని ఉపయోగించుకుని భవిష్యత్తులో ముందుకెళ్లాలని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఒడిలు కె.వి.వరప్రసాద్, ఎల్.వేణుగోపాల్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం కోసం వేడుకోలు

ప్రజాశక్తి తంబళ్లపల్లె

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వేలూరు ఆస్పత్రిలో చికిత్సలు పొందుతూ ఒక నిరుపేద యువకుడు ఆర్థిక సాయం కోసం దాతలను వేడుకున్నారు. తంబళ్లపల్లెకు చెందిన మల్లికార్జున తల్లి మృతి చెందడంతో డ్రైవర్‌గా పని చేస్తూ వృద్ధాప్యంలోని తండ్రి, తమ్ముని పోషించుకుంటున్నారు. నాలుగు రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి చేరుకున్నాడు. స్నేహితుడు వేలురు ఆసుపత్రికి తరలించారు. నిరుపేద కావడంతో ఆర్థిక సాయం కోసం దాతల కోసం, ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. అక్కడి డాక్టర్లు ఖరీదైన చికిత్సలు చేయాల్సి ఉంటుందని సుమారు రూ.5 లక్షలు తెలపడంతో దిక్కుతోచని స్థితిలో దాతల కోసం అర్థిస్తున్నాడు. దాతలు తోచిన కాడికి సమయం అందించాలని కోరుతున్నాడు. మల్లికార్జున ఫోన్ పే నెంబర్ :7993783127 బ్యాంక్ అకౌంట్ నెంబర్: 35244950137, ఐఎఫ్ఎస్‌సి కోడ్:ఎస్‌డిఐఎన్0012727కు పంపాలని కోరారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నిర్వహించిన నియోజకవర్గం స్థాయి క్రీడాపోటీలు ఆసక్తిని రేకెత్తించాయి. ఈ సందర్భంగా ఎంఇఒలు రెడ్డి శేఖర్, భీమేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల మండల స్థాయి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ అండర్ 14, అండర్ 17 విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 400 మంది విద్యార్థులకు నియోజకవర్గం స్థాయి పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జడ్‌పిటిసి రామచంద్ర యాదవ్, ఎంపిటిసి, ఎస్ఎంసి చైర్మన్ చంద్రశేఖర్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లాల సెక్రటరీ వసంత, నియోజకవర్గం సెక్రటరీ తాజ్ బాషాల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

రోటరీ క్లబ్ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న నాగ చంద్రశేఖర్‌రెడ్డి

రోటరీ క్లబ్ అధ్యక్షులుగా చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రోటరీ క్లబ్ ఆఫ్ అన్నమయ్య నూతన అధ్యక్షులుగా ఊటుకూరు ఎంపిటిసి నాగ చంద్రశేఖర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం రాత్రి ఎస్‌వివిఆర్ కల్యాణ మండపంలో రోటరీ క్లబ్ ఆఫ్ అన్నమయ్య మాజీ గవర్నర్ చిన్నపరెడ్డి, సహాయ గవర్నర్ జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతనంగా ఎన్నికైన క్లబ్ అధ్యక్షులు నాగశేఖర్‌రెడ్డి, కార్యదర్శి రాఘవేంద్ర, కోశాధికారి మిరియం శ్రీనివాసులు యాదవ్‌లను పూలమాల శాలువతో ఘనంగా సన్మానించి ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన వారు రోటరీ క్లబ్ సిద్ధాంతాలను అనుసరిస్తూ సమాజ సేవకు పాటుపడాలని సూచించారు. అధ్యక్షులు నాగ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ రంగాలలో సేవ చేసేందుకు రోటరీ క్లబ్ ద్వారా తనకు అవకాశం కల్పించిన జడ్పీ చైర్మన్ అమర్నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సేవ చేయడంలో రోటరీ క్లబ్ ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటుందని, తమ సంస్థ ద్వారా భవిష్యత్తులో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, వైసిపి నాయకులు ఆకేపాటి మురళీరెడ్డి, పోలా రమణారెడ్డి, మహేష్‌రెడ్డి, శివారెడ్డి, వెంకటరెడ్డి, పృథ్వీరెడ్డి, పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, నాగూరి, శ్రీను, పెరకం శంకర్, గొబ్బిళ్ల త్రినాథ్, మాధవరం అనిల్, పిచ్చిరెడ్డి, విశ్వనాథ్, సంగీత సుబ్బరాయుడు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

భర్త మృతదేహం కోసం భార్య ఎదురుచూపులు

ప్రజాశక్తి-పుల్లంపేట

జీవనోపాధి కోసం కువైట్ దేశానికి వెళ్లిన భర్త తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో భర్త మృతదేహం స్వదేశానికి రప్పించుకునేందుకు అవగాహన లేక నిస్సహాయస్థితులలో ఓ భార్య కన్నీటి గాథ ఇది. మండల పరిధిలోని కుమారుని పల్లె పరిజనవాడ గ్రామానికి చెందిన రాజబోయిన శివకుమార్ వయస్సు(51) ఐదేళ్ల కిందట జీవనోపాధి నిమిత్తం కువైట్ దేశానికి వెళ్లారు. ఆదివారం గుండెపోటుకు గురై అకస్మాత్తుగా మృతి చెందిన వార్త తెలియడంతో కుమారునిపల్లె గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడు శివకుమార్‌కి భార్య రామసుబ్బమ్మ, కుమార్తె మహేశ్వరి ఉన్నారు. భర్త మరణించిన వార్త తెలిసిన భార్య రామసుబ్బమ్మ కన్నీటి పర్యంతమైంది. భర్త కడసారి చూపు కోసం భర్త మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు స్థానిక రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు బాధిత కుటుంబంపై చొరవచూపి ఎపిఎన్‌ఆర్‌టిఎస్ (ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెన్షియల్ తెలుగు సొసైటీ) వారి ఆధ్వర్యంలో స్వదేశానికి తీసుకొచ్చే విధంగా సహాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు.

శివకుమార్ (ఫైల్ ఫోటో)

మాట్లాడుతున్న గ్రామ జ్యోతి సొసైటీ డైరెక్టర్ సుభద్ర

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సమాజానికి మానవ అక్రమ రవాణా మంచిది కాదని గ్రామజ్యోతి సొసైటీ డైరెక్టర్ సుభద్ర అన్నారు. మూమెంట్ ఇండియా సూచనల మేరకు సోమవారం చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో క్రిస్టఫర్ లైట్ రెడ్ రోప్ ఆర్గనైజేషన్ అధినేత్రి గ్రామజ్యోతి సొసైటీ డైరెక్టర్ సుభద్ర మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా గురించి తీసుకో వలసిన జాగ్రత్తల గురించి, యువత మొదటి ప్రాధాన్యత,నైతిక విలువల గురించి, బాల్య వివాహాలు, విద్య యొక్క ప్రాముఖ్యతను,గురించి తల్లితండ్రుల, ముఖ్యపాత్ర, ఈ సమాజంలో ఆడపిల్లలు చదువు తోపాటు వాళ్లను వాళ్ళు రక్షించుకునే విధంగా అవగాహన కలిగి ఉండాలన్నారు.రవాణా,ప్రేమ పేరుతో, పెళ్లి పేరుతో, ఉద్యోగం పేరుతో రకరకాలుగా మనుషులను ప్రలోభపెట్టి, మానవ అక్రమ రవాణా చేయించడం, వారి నుండి అవయవాలను తీసుకోవడం, వారిని వ్యభిచార గృహాలకు అమ్మి సొమ్ము చేసుకోవడం జరుగు తుందన్నారు. యువతీ, యువకులకు అవగాహన కల్పించారు. యువత మార్గదర్శకాలను చూసుకొని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం అడ్మినిస్ట్రేటర్ డైరెక్టర్ డాక్టర్ జివిఎస్ బాబు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాపై కిషోర బాలబాలికలకు అవగాహన కల్పించాలని, పురుషులు, స్త్రీలు, వయోజనులు, యువతి, యువకుల ద్వారా లైంగికంగా శ్రమ ద్వారా బాధించి వేధించి దోపిడీ చేయడం అమానుషమని,శిక్షార్హమని తెలిపారు. మానవ అక్రమ రవాణాకు సంబంధించిన, ప్లే కార్డులు ప్రద ర్శించారు. కార్యక్రమంలో చైతన్య సత్యం సేవా సంస్థలోని విద్యార్థులు ఎంతో ఉత్సహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపీ ఆనందన్, ప్రధాన కార్యదర్శి ఎ.కవితా రాణి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణచరణ్ అడల్ ఫర్ ఫ్రీడమ్ సభ్యులు సైక్లర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి - పుల్లంపేట

కడప జిల్లా ఖాజీపేటలో ఆదివారం జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ జూనియర్స్, సబ్ జూనియర్స్ పోటీలలో మండలంలోని కొత్తపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారని పాఠశాల పీడీ బాల శేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన తమ పాఠశాల విద్యార్థులు శ్రీజ, పల్లవి జూనియర్స్ విభాగానికి అదేవిధంగా పుష్పలత, వైష్ణవి సబ్ జూనియర్ విభాగానికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు త్వరలో 29వ తేదీన కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఆదర్శ పాఠశాలలో జిల్లా స్థాయి పోటీల్లో అండర్-19 క్రికెట్ విభాగంలో కవితారెడ్డి రాష్ట్ర స్థాయి పోటీలలో ఎంపికవ్వడం పట్ల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో పీడీ బాలశేఖర్

జిల్లా జట్టు విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

జిల్లా జట్టుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

సాఫ్ట్ బాల్, బేస్ బాల్ జిల్లా జట్టుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.విజయ్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పుల్లంపేట ఎపి ఆదర్శ మోడల్ స్కూల్‌లో జరిగిన ఎస్‌జిఎఫ్ అండర్-19 సాఫ్ట్ బాల్, బేస్ బాల్ ఎంపికలో పాల్గొని కె.ఇందు (మొదటి సంవత్సరం బైపిసి), కె.విష్ణు (రెండవ సంవత్సరం సిఇసి) ఉమ్మడి కడప జిల్లా జట్లకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే సాఫ్ట్ బాల్, కడప జిల్లాలో జరగబోయే బేస్ బాల్ స్టేట్ మీట్ లో పాల్గొంటారని వ్యాయామ అధ్యాపకులు ఎం.చంద్ర మోహన్ రాజు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులను కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథి లహరీ

'మిట్స్'లో 'అమృత్ కాల్ విమర్శ్'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అమృత్ కాల్ విమర్శ వికసిట్ భారత్ ఎ2047 కార్యక్రమంలో భాగంగా భారతదేశంలోని ఉన్నత విద్యా సంస్థల క్యాంపస్‌లలో అభివృద్ధి సంభాషణపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం యొక్క దృక్పథం వైపు దృఢంగా సాగేలా చేయడానికి మన యువ విధానాన్ని పునఃసమీక్షించడం కోసం ముక్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశం యొక్క దార్శ నికత మన యువజన విధానం వెనుక మార్గదర్శక శక్తిగా ఈ కార్యక్రమం ఉండాలి అని, టెక్నాలజీ రంగంలో ప్రతి ఒక్కరిని వారి వారి లక్ష్యాలకు అనుగు నంగా తీర్చి దిద్దడానికి ఈ కార్యక్రమం ఒక మంచి అవకాశాలమన్నారు. క్షేత్రస్థాయి విద్యావేత్తలు, పరిపాలన, క్రీడలు, సంగీతం, ప్రజా సేవలలో ప్రము ఖులు దేశంలోని కళాశాలలను సందర్శించి సామాన్యుల జీవితాల్లో గణనీ యమైన ప్రభావాన్ని చూపిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలు, విధానాలు, థీమ్‌లపై ప్రసంగం, ఉపన్యాసాలు నిర్వహిస్తారని తెలిపారు. ఆటోమొబైల్ స్కిల్ డెవలప్మెంట్ కౌన్సిల్ సిఇఒ అరిందమ్ లహిరీ పాల్గొని మాట్లాడుతూ ఇండియన్ ఆటో మొబైల్ ఇండస్ట్రీ గురుంచి విద్యార్థులకు వివరించారు. కార్యకమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్, పార్క్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రదీప్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల బృందం

కుస్తీ పోటీల్లో అన్నమాచార్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విశాఖపట్నంలో ఈ నెల 23, 24వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలలో బోయనపల్లిలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొని ఒక బంగారు పతకం, ఆరు రజత పతకాలు సాధించారని కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి.నారాయణల వెల్లడించారు. సోమవారం వారు మాట్లాడుతూ 58 కిలోల విభాగంలో బిటెక్ సివిల్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న టి.నరసింహ పవన్‌రెడ్డి బంగారు పతకం, బిటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న కె.సాయివిఘ్నేశ్వర్‌రెడ్డి, బిటెక్ తృతీయ సంవత్సరం ఎఐఅండ్‌డిఎస్, కె.హరినాథ్ నాయుడు, బిటెక్ ద్వితీయ సంవత్సరం సిఎస్ఇడిఎస్ చదువుతున్న వై.దినేష్ కుమార్ రజత పతకాలను సాధించారని తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు బంగారు, రజత పతకాలు సాధించడం ఎంతో గొప్పవిషయమని కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి.నారాయణలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగముని మాట్లాడుతూ పతకాలు సాధించిన విద్యార్తులు ఈ నెల 28వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు గుజరాత్‌లో జరగబోయే మూడవ జాతీయ స్థాయి గ్రాప్లింగ్ కుస్తీ పోటీలలో పాల్గొనన్నట్లు తెలిపారు.

మహాత్మా గాంధీ కలలను నిజం చేద్దాం

ప్రజాశక్తి- కలకడ

మహాత్మాగాంధీ కలలను నిజం చేయాలని డిపిఒ ధనలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌లో క్లాప్ మిత్రాస్‌కి సన్మానం చేసి వారితో కలిసి టి తాగారు. వారి సేవలను గుర్తించి ప్రభుత్వం సన్మానం చేసిందని మరింత ఉత్సాహంగా పనిచేయాలని చెప్పారు. గాంధీజీ గారు కలలుగన్న స్వచ్ఛ్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తూ స్వచ్ఛతే హి సేవ కార్యక్రమం నిర్వహింస్తామని పేర్కొన్నారు. అన్ని వీధులు, అన్ని గ్రామాలు, అన్ని పట్టణాలు, అన్ని నగరాలు, స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ వైపు చిన్న, పెద్ద ప్రతి ఒక్కరూ భాగస్వాములై అన్ని స్కూల్లో, అన్ని కార్యాలయాలు, హాస్పిటల్స్, పార్కులు పరిశుభ్రంగా ఉంచాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఎటువంటి జబ్బులు మానవులకి సోకమని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి లతీఫ్‌ఖాన్, కలకడ సర్పంచ్ పరీజాన్ అలి ఖాన్, సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్.ఓ.సి.నెం.1146/ఎ1/2011 తేది:25.09.2023

మదనపల్లె పురపాలక సంఘము

బహిరంగ వేలము ప్రకటన

మదనపల్లె పురపాలక సంఘములో వివిధ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో మొదటి అంతస్తులలో ఖాళీగా వున్న మున్సిపల్ షాపు రూములు మరియు ఆంధ్ర కేసరి విపణికల్ప షాపు రూము నెం.08 (హోటల్)కు చెందిన షాపు రూములు నెలసరి బాడుగ ఇచ్చుటకు గాను ది:27.09.2023వ తేది ఉ॥11.00 గం॥లకు మున్సిపల్ కార్యాలయము నందు బహిరంగ వేలము నిర్వహించబడును. కావున ఆసక్తి గల ఇతర వివములు కొరకు మున్సిపల్ కార్యాలయము నందు రెవెన్యూ విభాగమునకు సంప్రదించగలరు.

కమీషనరు, మదనపల్లె పురపాలక సంఘము